క్లుప్తంగా

పేడాడ రమణికుమారి ప్రమాణ స్వీకారం



పాలక మండలి సభ్యురాలిగా సంతకం పెడుతున్న పేడాడ రమణికుమారి

మద్దిపాలెం: శ్రీకాకుళం జిల్లా డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ విశ్వవిద్యాలయం పాలక మండలి సభ్యురాలిగా వైఎస్సార్‌సీపీ మహిళా నాయకురాలు పేడాడ రమణికుమారి ఆదివారం ప్రమాణ స్వీకారం చేశారు. యూనివర్సిటీ వీసీ ప్రొఫెసర్ నిమ్మ వెంకటరావు, రిజిస్ట్రార్ సిహెచ్.ఎ.రాజేంద్రప్రసాద్‌ను ఆమె మర్యాదపూర్వకంగా కలిసి, శాలువాతో సత్కరించారు. అనంతరం క్యాంపస్‌లోని పలు బ్లాక్‌లను సందర్శించారు. సెప్టెంబర్‌లో రమణికుమారిని పాలక మండలి సభ్యురాలిగా నియమిస్తూ రాష్ట్ర ప్రభుత్వ ముఖ్య కార్యదర్శి జె.శ్యామలరావు ఉత్తర్వులు జారీ చేసిన సంగతి తెలిసిందే.

ఉచిత వైద్య శిబిరం



కార్పొరేటర్ రెయ్యి వెంకటరమణకు టెస్టులు చేస్తున్న వైద్య సిబ్బంది

మద్దిపాలెం: జీవీఎంసీ 51వ వార్డు ఈస్ట్ పార్కులో పార్కు అసోసియేషన్ అధ్యక్షుడు మురళీకృష్ణ, మహిళా వాకర్స్ ఆధ్వర్యంలో ఆదివారం ఉచిత వైద్య శిబిరం నిర్వహించారు. కార్యక్రమాన్ని ముఖ్య అతిథి కార్పొరేటర్ రెయ్యి వెంకటరమణ ప్రారంభించారు. కేర్ ఆస్పత్రి వైద్య బృందం డాక్టర్ రాకేష్, డాక్టర్ రాజేష్ రెడ్డి, డాక్టర్ ప్రశాంత్ తదితరులు స్థానికులకు బీపీ, సుగర్, బీఎంఐ, ఈసీజీ వంటి పరీక్షలు చేశారు. ఈస్ట్ పార్క్ పాలక వర్గ సభ్యులు, మహిళా వాకర్స్ క్లబ్ ప్రతినిధులు పాల్గొన్నారు.

విద్యార్థిని అదృశ్యం

మద్దిపాలెం: కంచరపాలెం ఐదో పట్టణ పోలీస్ స్టేషన్ పరిధిలో ఓ విద్యార్థిని అదృశ్యమైన ఘటన జరిగింది. పోలీసులు తెలిపిన వివరాలిలా.. జి.హాసిని అనే 15 ఏళ్ల బాలిక కంచరపాలెం బాపూజీనగర్‌లో తల్లిదండ్రులతో కలిసి నివసిస్తోంది. కంచరపాలెంలోని ఓ ప్రైవేట్ స్కూల్‌లో 10వ తరగతి చదువుతోంది. ప్రతి రోజూ హాసినిని తండ్రి స్కూల్‌కు తీసుకెళ్తారు. సాయంత్రం స్కూల్ వదిలాక అటు నుంచి కైలాసపురంలో ట్యూషన్‌కు వెళ్తుంది. ఈ క్రమంలో శనివారం ఉదయం తండ్రి స్కూల్ వద్ద డ్రాప్‌చేశారు. రోజూ మాదిరి రాత్రి ట్యూషన్ వద్దకు కుమార్తెను తీసుకురావడానికి వెళ్లారు. హాసిని ట్యూషన్‌కు రాలేదని వారు చెప్పడంతో స్కూల్‌లో కూడా కనుక్కున్నారు. పాఠశాలకు కూడా రాలేదనడంతో అంతటా గాలించారు. ఫలితం లేకపోవడంతో ఆదివారం కంచరపాలెం పీఎస్‌లో తల్లి జి.నాగమణి ఫిర్యాదు చేశారు. సీఐ ఎస్.సాయి నేతృత్వంలో ఉమెన్ ఎస్ఐ దివ్యభారతి కేసు దర్యాప్తు చేపట్టారు.

నేడు జీవీఎంసీలో 'జగనన్నకు చెబుదాం'

డాబాగార్డెన్స్: జీవీఎంసీ ప్రధాన కార్యాలయంలో ఉదయం 11 నుంచి మధ్యాహ్నం 1 గంట వరకు జగనన్నకు చెబుదాం కార్యక్రమం నిర్వహించనున్నారు. పారిశుధ్యం, పట్టణ ప్రణాళిక విభాగం, రెవెన్యూ, యూసీడీ, ఇంజనీరింగ్ తదితర విభాగాలకు సంబంధించి గ్రీవెన్స్‌లో ఫిర్యాదు చేయవచ్చని మేయర్ గొలగాని హరి వెంకటకుమారి, జీవీఎంసీ కమిషనర్ సాయికాంత్ వర్మ తెలిపారు.



నందగిరినగర్‌లో తొలి పూజ చేస్తున్న కార్పొరేటర్ పెద్దిశెట్టి ఉషశ్రీ



నక్కవానిపాలెంలో విజయదుర్గమ్మవారిని దర్శించుకుంటున్న నెడ్‌క్యాప్ చైర్మన్ కె.కె.రాజు



సన్‌రైజ్ క్లబ్ ఆవరణలో ప్రత్యేక అలంకరణలో కనకదుర్గమ్మ

చల్లని తల్లికి ప్రణమిల్లి..

- వైభవంగా దేవీ శరన్నవరాత్రులు ప్రారంభం
- తొలి రోజు అమ్మవారికి విశేష పూజలు



లలితా పీఠంలో బాలా త్రిపురసుందరి దేవీ అలంకరణలో లలిత అమ్మవారు



సీతంపేట పార్వతీశ్వరాలయంలో కుంకుమ పూజలు చేస్తున్న మహిళలు



గాయత్రీదేవి ఆలయంలో పూజలు చేస్తున్న కార్పొరేటర్ రెయ్యి వెంకటరమణ



బాలయ్యశాస్త్రి లేఅవుట్‌లో అమ్మవారిని దర్శించుకుంటున్న ఆళ్ల శివగణేష్ తదితరులు

సీతంపేట: దుర్గాదేవి శరన్నవరాత్రి మహోత్సవాలు నియోజకవర్గంలో ఆదివారం అంగరంగ వైభవంగా ప్రారంభమయ్యాయి. అమ్మవారి ఆలయాలు, ప్రధాన రహదారులు, కాలనీల్లో ఏర్పాటు చేసిన మండపాల్లో తొలి రోజు విగ్రహ ప్రతిష్ట, కలశ స్థాపనతో విశేష పూజలు నిర్వహించారు.

మహాలక్ష్మిగా పార్వతీదేవి

సీతంపేట పార్వతీశ్వరాలయంలోని పార్వతీదేవి మహాలక్ష్మి అలంకారంలో భక్తులకు దర్శనమిచ్చారు. అర్చకులు శివాజీశర్మ, భాస్కరశర్మ పర్యవేక్షణలో లలితా సహస్రనామార్చన, ఖడ్గమాలార్చన, మహాలక్ష్మి నామార్చన, చండీ హోమం జరిపారు. అమ్మవారి శ్రీచక్ర మేరువులకు మహిళలు సామూహిక కుంకుమ పూజలు, లలితా పారాయణ చేశారు.

బాలా త్రిపురసుందరిగా లలితాదేవి

అక్కయ్యపాలెం లలితానగర్ లలితా పీఠంలో తొలి రోజు లలితా అమ్మవారు బాలా త్రిపురసుందరీదేవి అలంకరణలో భక్తులకు దర్శనమిచ్చారు. అమ్మవారికి ఉదయం 4 గంటలకు పంచామృతాభిషేకం, అర్చన, బాలభోగం నివేదన చేశారు. పీఠం దర్బారు హాల్‌లో లలితా, కామేశ్వరుల విగ్రహాలను ప్రతిష్ఠించి, పండితుల వేద మంత్రాల మధ్య కలశ స్థాపన, మండప ఆవాహన, అంకురార్పణ చేసి ఉత్సవాలను ప్రారంభించారు. సోమవారం గాయత్రీ దేవి అలంకారంలో అమ్మవారు దర్శనమిస్తారని, సాయంత్రం లక్ష్మీగణపతి, చండీ హోమాలు జరుగుతాయని పీఠం మేనేజర్ మన్నవ కృష్ణసేన్ తెలిపారు.

● 43వ వార్డు నందగిరినగర్, శ్రీనివాసనగర్ ప్రాంతాల్లో శరన్నవరాత్రి ఉత్సవాలు భక్తిశ్రద్ధలతో నిర్వహిస్తున్నారు. న్యూఫ్రెండ్స్ అసోసియేషన్ ఆధ్వర్యంలో నందగిరినగర్‌లో ఏర్పాటు చేసిన దుర్గమ్మ మండపంలో ముఖ్య అతిథి కార్పొరేటర్ పెద్దిశెట్టి ఉషశ్రీ తొలి పూజ చేసి ఉత్సవాలను ప్రారంభించారు.

విజయదుర్గమ్మకు కె.కె.రాజు పూజలు

సీతమ్మధార: జీవీఎంసీ 24వ వార్డులో లక్కీ యూత్ అసోసియేషన్ ఆధ్వర్యంలో నక్కవానిపాలెం ఉమా నీలకంఠేశ్వర స్వామి ఆలయం ఎదురుగా నిర్వహిస్తున్న దేవీ శరన్నవరాత్రి ఉత్సవాలను ముఖ్య అతిథి నెడ్‌క్యాప్ చైర్మన్, వైఎస్సార్‌సీపీ ఉత్తర సమన్వయకర్త కె.కె.రాజు ప్రారంభించి, విజయదుర్గమ్మ వారికి ప్రత్యేక పూజలు చేశారు. మధ్యాహ్నం మండపం వద్ద కోలాట ప్రదర్శన నిర్వహించారు. కార్యక్రమంలో కార్పొరేటర్ సాడి పద్మారెడ్డి, సింహాచలం దేవస్థానం బోర్డు సభ్యుడు సంపంగి శ్రీనివాసరావు, మజ్జి ఉమామహేశ్వరరెడ్డి, నిర్వాహకులు బండారు గుప్తా, సభ్యులు రాజారెడ్డి, జె.కె.రాజు, చంటి, రాయుడు శ్రీను, రామిరెడ్డి, భక్తులు తదితరులు పాల్గొన్నారు.

● రేసపువానిపాలెం గ్రామ సేవా సంఘం ఆధ్వర్యంలో రేసపువానిపాలెంలో భూలోకమాత శరన్నవరాత్రి మహోత్సవాలు ఘనంగా ప్రారంభించారు. ఉదయం 4.30 గంటలకు జలాభిషేకం, 5.30 గంటలకు పంచామృత, సుగంధ ద్రవ్యాభిషేకాలు, 6.30 గంటలకు నవదుర్గా హోమం నిర్వహించారు.

● జీవీఎంసీ 14వ వార్డు బాలయ్యశాస్త్రి లేఅవుట్‌లో సిద్ధి వినాయక యూత్ అసోసియేషన్ ఆధ్వర్యంలో దుర్గాదేవికి ఘనంగా పూజలు నిర్వహించారు. ఆదివారం సాయంత్రం అమ్మవారికి వైఎస్సార్‌సీపీ జిల్లా యువజన విభాగం అధ్యక్షుడు ఆళ్ల శివగణేష్, జేసీఎస్ అధ్యక్షుడు అమర్‌రెడ్డి, నిర్వాహకులు శ్రీను, కిశోర్, రామకృష్ణ, బంగారురాజు పూజలు చేశారు.

స్వర్ణకవచ అలంకరణలో దుర్గమ్మ

కంచరపాలెం: జీవీఎంసీ 55వ వార్డు రెడ్డి కంచరపాలెం సన్‌రైజ్ క్లబ్ ఆవరణలోని కనకదుర్గమ్మవారి ఆలయంలో ఉత్సవ కమిటీ నేతృత్వంలో ప్రధాన అర్చకుడు కె.శర్మ కలశ ప్రతిష్ఠ చేసి ప్రత్యేక పూజలు నిర్వహించారు. అమ్మవారిని స్వర్ణకవచ దేవిగా అలంకరించి క్షీరాభిషేకం చేశారు. భక్తులు అమ్మవారిని దర్శించుకున్నారు.

దుర్గాదేవి మండపాల సందర్శన

మద్దిపాలెం: దేవీ శరన్నవరాత్రి ఉత్సవాల సందర్భంగా జీవీఎంసీ 51వ వార్డులో ఏర్పాటు చేసిన దుర్గమ్మవారి మండపాలను ఆదివారం కార్పొరేటర్ రెయ్యి వెంకటరమణ సందర్శించారు. మాధవధార వుడా కాలనీ కనకదుర్గా ఆటోస్టాండ్ ఆధ్వర్యంలో, సీతన్న గార్డెన్స్‌లోని గాయత్రీదేవి ఆలయంలో ధర్మకర్త సనపల కీర్తి ఆధ్వర్యంలో, వాంబే కాలనీ నవదుర్గ యూత్ కమిటీ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన మండపాల్లో అమ్మవారిని ఆయన దర్శించుకుని పూజలు చేశారు.

సామూహిక కుంకుమ పూజలు

మురళీనగర్: మురళీనగర్ రామాలయంలో వెలసిన లలితాదేవి ఆలయంలో అమ్మవారికి ప్రత్యేక పూజలు చేశారు. బాలా త్రిపురసుందరిగా అమ్మవారిని అలంకరించి భక్తులకు దర్శనం కల్పించారు. మహిళలు సామూహిక కుంకుమ పూజలు నిర్వహించారు. చక్కెర పొంగలి ప్రసాదం సమర్పించి భక్తులకు పంపిణీ చేశారు. పట్టాభిరెడ్డితోటలో సంపత్ వినాయగర్ యూత్ అసోసియేషన్ ఆధ్వర్యంలో భారీ విగ్రహాన్ని ఏర్పాటు చేసి భక్తులు పూజలు చేశారు.

● ఎన్‌జీజీవోస్ కాలనీ వైభవ వేంకటేశ్వరస్వామి ఆలయంలో తిరాత్రి మహోత్సవాలు ఈ నెల 22నుంచి 25 వరకు నిర్వహిస్తామని ఈవో బి.ప్రసాద్ తెలిపారు. ఈ సదర్భంగా పద్మావతి అమ్మవారికి విశేష కుంకుమార్చనలు నిర్వహిస్తామన్నారు.



బాలాత్రిపురసుందరిగా లలితాదేవి దర్శనం



మురళీనగర్ ఆలయంలో కుంకుమ పూజలు చేస్తున్న భక్తులు

అలరించిన అన్నమయ్య సంకీర్తనలు

సీతమ్మధార: నార్త్ ఎక్స్‌టెన్షన్‌లోని మహాగణపతి, ప్రసన్న వేంకటేశ్వరస్వామి, అయ్యప్ప, షిర్డీసాయి బాబా ఆలయంలో ఆదివారం దేవీ నవరాత్రులు, ప్రసన్న వేంకటేశ్వర స్వామి బ్రహ్మోత్సవాలు ఘనంగా ప్రారంభమయ్యాయి. ప్రధాన అర్చకుడు రాజాస్వామి ఆధ్వర్యంలో అర్చక బృందం ఉదయం 6 గంటలకు దుర్గా హోమం, మహాలక్ష్మి దుర్గమ్మవారికి అభిషేకం చేశారు. ఉదయం 6 గంటలకు ప్రసన్న వేంకటేశ్వర స్వామికి ప్రత్యేక అభిషేకాలు నిర్వహించారు. మధ్యాహ్నం అన్నసంతర్పణ జరిగింది. సాయంత్రం అమ్మవారికి కుంకుమ పూజలు చేశారు. 7 గంటలకు వెంకన్న తిరువీధి అత్యంత వైభవంగా జరిగింది. చైతన్య బ్రదర్స్ వారి శిష్య బృందం నిర్వహించిన అన్నమయ్య సంకీర్తనల గానాలహరి కార్యక్రమం అలరించింది. కార్యక్రమంలో భక్తులు పాల్గొన్నారు.

'నేవీ సివిలియన్ ఆఫీసర్స్' నూతన కార్యవర్గం

సీతంపేట: ఇండియన్ నేవీ సివిలియన్ ఆఫీసర్స్ అసోసియేషన్, ఈస్టర్న్ నేవల్ కమాండ్ డివిజన్ సర్వసభ్య సమావేశం ఆదివారం రామాటాకీస్ రోడ్డులోని వేదిక ఫంక్షన్ హాల్లో జరిగింది. అడ్మినిస్ట్రేటివ్ ఆఫీసర్స్ టి.ఎస్.రాయ్, భవేశ్‌కుమార్, వైద్యాధికారి డాక్టర్ కె.సుజిత్ ముఖ్య అతిథులుగా పాల్గొన్నారు. సమావేశంలో సంఘం అధ్యక్షుడు, ప్రధాన కార్యదర్శి, కోశాధికారి అసోసియేషన్ పనితీరు, ఆర్థిక నివేదికలను సభకు వివరించారు. 2023–25 కాలానికి ఎన్నికలు నిర్వహించారు. అధ్యక్షుడిగా జి.ప్రకాశరావు, ప్రధాన కార్యదర్శిగా పైలా శ్రీనివాస్, కోశాధికారిగా బి.వి.నరసింహం ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. ఉపాధ్యక్షులుగా కె.రమేష్‌కుమార్, బి.సర్దార్, కె.వి.ఎస్.ఎన్.రాజు ఎన్నికయ్యారు. డైరెక్టర్ జి.వి.సుబ్రహ్మణ్యం, ప్రిన్సిపల్ సైంటిఫిక్ ఆఫీసర్ సి.ప్రవీణ్‌కుమార్ ఎన్నికల అధికారులుగా వ్యవహరించారు.

చదువుతోపాటు క్రీడలూ ముఖ్యం

సీతమ్మధార: అఖిల భారతీయ విద్యా భారతి శిక్షా సంస్థాన్ ఆధ్వర్యంలో బీవీకే విద్యా సంస్థలు ఆతిథ్యమిస్తున్న 34వ జాతీయ బాస్కెట్ బాల్ చాంపియన్‌షిప్ ముగింపు పోటీలు ఆదివారం సీతమ్మధారలోని ఒక ప్రైవేట్ స్కూల్‌లో నిర్వహించారు. వీటిని మాజీ ఎమ్మెల్యే పి.విష్ణుకుమార్‌రాజు ప్రారంభించి మాట్లాడారు. విద్యార్థులు చదువుతోపాటు క్రీడల్లోనూ రాణించాలని సూచించారు. క్రమశిక్షణకు మారుపేరైన విద్యా భారతి, బీవీకే విద్యా సంస్థల విద్యార్థులు క్రీడల్లో రాణించి దేశానికి మంచిపేరు తీసుకురావాలని ఆకాంక్షించారు. ప్రపంచ వ్యాప్తంగా పలు క్రీడల్లో భారత్ మొదటి స్థానంలో ఉందన్నారు. విద్యా సంస్థల ప్రతినిధులు పాల్గొన్నారు.

అభివృద్ధి పనులకు శంకుస్థాపన



సింగరాయిమెట్ట వద్ద శిలాఫలకాన్ని ఆవిష్కరిస్తున్న కె.కె.రాజు, వావిలపల్లి ప్రసాద్



వైఎస్సార్ నగర్‌లో శంకుస్థాపన కార్యక్రమంలో కె.కె.రాజు, కార్పొరేటర్ కంపా హనోకు

మద్దిపాలెం: జీవీఎంసీ 50వ వార్డులోని పలు ప్రాంతాల్లో అభివృద్ధి పనులకు ఆదివారం నెడ్‌క్యాప్ చైర్మన్, వైఎస్సార్‌సీపీ ఉత్తర సమన్వయకర్త కె.కె.రాజు కార్పొరేటర్ వావిలపల్లి ప్రసాద్‌తో కలిసి శంకుస్థాపన చేశారు. సింగరాయిమెట్ట, సత్యానగర్ ప్రాంతాల్లో రూ.1.38 కోట్లతో చేపట్టనున్న రోడ్లు, కాలువలు, రిటైనింగ్ వాల్స్ నిర్మాణ పనులను ప్రారంభించారు. ఈ సందర్భంగా కె.కె.రాజు మాట్లాడుతూ అభివృద్ధి పథంలో విశాఖను నడిపించాలన్నదే ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ఆకాంక్షని, ప్రజలకు మెరుగైన సేవలు అందించే దిశగా ప్రభుత్వం పనిచేస్తోందని పేర్కొన్నారు. కార్యక్రమంలో డిప్యూటీ మేయర్, పార్టీ మండల అధ్యక్షుడు కటుమూరి సతీష్, ఫ్లోర్ లీడర్, పార్టీ మండల అధ్యక్షుడు బాణాల శ్రీనివాసరావు, డిప్యూటీ ఫ్లోర్ లీడర్, పార్టీ మండల అధ్యక్షుడు అల్లు శంకరరావు, 14వ వార్డు కార్పొరేటర్ కె.అనిల్‌కుమార్ రాజు, డీఈ భరణి, ఏఈ సతీష్, రాష్ట్ర సంయుక్త కార్యదర్శి కిరణ్‌రాజు, పార్టీ మండల అధ్యక్షుడు పైడి కృష్ణారావు మాస్టరు, సీనియర్ నాయకులు పొన్నాడ అప్పారావు మాస్టర్, ఏవీఎస్ రాజు, సనపల నారాయణస్వామి, సనపల రమేష్, రాజాం రాజు, ఎం.లక్ష్మి, ఎం.సునీల్, ప్రసూనారెడ్డి, పొన్నాడ రమేష్, దాలినాయుడు, రాజేశ్వరరావు, రామారావు, పాతపట్నం రామ్మోహన్, ఎంవీ రెడ్డి, సబ్బవరపు శ్రీను, రాంబాబు, సీహెచ్ శ్రీను, మురళీ, త్రినాథ్, భోగేష్, దిలీప్, చిరంజీవి, జగన్నాథం, సోనీ, రాజేశ్వరి, రత్నం, జీవీఎంసీ వర్క్ ఇన్‌స్పెక్టర్లు, సచివాలయ కన్వీనర్లు, వలంటీర్లు పాల్గొన్నారు.

వైఎస్సార్ నగర్‌లో సామాజిక భవనానికి..

తాటిచెట్లపాలెం: జీవీఎంసీ 45వ వార్డు వైఎస్సార్ నగర్‌లో కార్పొరేటర్, డిప్యూటీ ఫ్లోర్ లీడర్ కంపా హనోకు ఆధ్వర్యంలో ఆదివారం సామాజిక భవన నిర్మాణానికి శంకుస్థాపన చేశారు. నెడ్‌క్యాప్ చైర్మన్, వైఎస్సార్‌సీపీ ఉత్తర సమన్వయకర్త కె.కె.రాజు చేతుల మీదుగా ఈ కార్యక్రమం నిర్వహించారు. వైఎస్సార్ నగర్‌లోని సామాజిక భవనంపై మొదటి అంతస్తు, అదనపు సౌకర్యాల కోసం రూ.57.38 లక్షల నిధులు మంజూరైనట్లు జీవీఎంసీ సిబ్బంది తెలిపారు. పార్టీ వార్డు అధ్యక్షుడు, రాష్ట్ర ఎడ్యుకేషన్ వెల్ఫేర్ ఇన్‌ఫ్రాస్ట్రక్చర్ డెవలప్‌మెంట్ కార్పొరేషన్ డైరెక్టర్ పైడి రమణ, డిప్యూటీ మేయర్ కటుమూరి సతీష్, ఫ్లోర్ లీడర్ బాణాల శ్రీనివాసరావు, డిప్యూటీ ఫ్లోర్ లీడర్ అల్లు శంకరరావు, 14వ వార్డు కార్పొరేటర్ కె.అనిల్‌కుమార్‌రాజు, రాష్ట్ర సంయుక్త కార్యదర్శి కిరణ్‌రాజు, జీవీఎంసీ డీఈ భరణి, ఏఈ, వార్డు నాయకులు హరిపట్నాయక్,, నేపాల్ శ్రీను, బాబూరావు, సన్నీ, గణపతి, నాగరాజు, రామారావు, సన్యాసప్పలనాయుడు, దుర్గ, ఆదిలక్ష్మి, సువర్ణ, తవుడమ్మ, శ్యాం, సచివాలయ సిబ్బంది, కన్వీనర్లు, గృహసారథులు, వలంటీర్లు పాల్గొన్నారు.

గుర్తు తెలియని వ్యక్తి మృతి

తాటిచెట్లపాలెం: మర్రిపాలెం రైల్వేస్టేషన్ సమీపంలో గుర్తు తెలియని వ్యక్తి మరణించినట్లు విశాఖపట్నం జీఆర్పీ సిబ్బంది తెలిపారు. వివరాలిలా.. ఆదివారం ఉదయం మర్రిపాలెం రైల్వేస్టేషన్ సమీపంలో సుమారు 35–40 ఏళ్ల వ్యక్తి రైలు నుంచి జారిపడటం వల్ల లేదా, ట్రాక్ దాటుతున్న సమయంలో రైలు ఢీకొనడం వల్ల మృతిచెందాడు. మృతదేహాన్ని కేజీహెచ్ మార్చురీలో భద్రపరిచారు. ఇతడి వద్ద ఏ విధమైన ఆధారాలు లేవు. మృతుడు సుమారు 5.6 అడుగుల ఎత్తు, చామన చాయ శరీరం, నలుపు రంగు గెడ్డం కలిగి బిస్కెట్ కలర్ చొక్కా, బ్లూ కలర్ జీన్‌ప్యాంట్ ధరించి ఉన్నాడు. మృతుడి ఎడమ చేతి మీద వరలక్ష్మి అనే పేరు, ఓంకారం పచ్చబొట్లు, ఛాతీ మీద సీతా కోకచిలుక ఆకారంలో పచ్చబొట్టు ఉంది. జీఆర్పీ సీఐ ఆదేశాల మేరకు ఎస్ఐ జి.శ్రీనివాసరావు కేసు దర్యాప్తు చేస్తున్నారు. మృతుడి వివరాలు తెలిసిన వారు విశాఖపట్నం రైల్వేస్టేషన్‌లోని జీఆర్పీ సిబ్బందికి స్వయంగా లేదా 98664 13487, 94406 27547 నంబర్లలో గానీ తెలియజేయాలని రైల్వే పోలీసులు కోరారు.


చురుగ్గా ఆరోగ్య సురక్ష సర్వే

కంచరపాలెం : జ్ఞానాపురం యూపీహెచ్‌సీ పరిధిలో ఈ నెల 30, 31 తేదీల్లో జరగనున్న జగనన్న ఆరోగ్య సురక్ష వైద్య శిబిరానికి పక్కాగా సర్వే నిర్వహిస్తున్నామని వైద్యాధికారి డాక్టర్ వినీలా తెలిపారు. 30న జోన్–5 కార్యాలయం వద్ద, 31న కంచరపాలెం పరిధిలో శిబిరాలు జరుగుతాయన్నారు.

నిప్పంటుకుని మూడు వాహనాలు దగ్ధం



ప్రమాదంలో కాలిపోయిన కారు



తాటిచెట్లపాలెం రామాలయం వీధి వెనుక దగ్ధమవుతున్న కారు, బొలెరో వాహనాలు

సీతమ్మధార: ఫోర్త్‌టౌన్ పోలీస్ స్టేషన్ పరిధి తాటిచెట్లపాలెం రామాలయం వీధిలో శనివారం అర్ధరాత్రి పార్క్‌చేసి ఉన్న మూడు వాహనాలకు నిప్పంటుకుంది. ఈ సంఘటనపై బాధితుడు ఆదివారం ఫోర్త్‌టౌన్ పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేశాడు. వివరాలిలా.. నీలాచలం బగాది అనే వ్యక్తి తాటిచెట్లపాలెం రామాలయం వీధిలో 20 ఏళ్లుగా నివసిస్తున్నాడు. ఎప్పటిలాగే తన కారును శనివారం రాత్రి రామాలయం వెనుక భాగంలో పార్క్ చేశాడు. సుమారు అర్ధరాత్రి ఒంటి గంట సమయంలో పక్కనే ఉన్న చెత్త కుప్పకు నిప్పంటుకుని అక్కడే ఉన్న రెండు బొలెరో వాహనాలతోపాటు అతడి కారుకు మంటలు వ్యాపించి దగ్ధమయ్యాయి. కారు ఎడమ భాగం కాలిపోయి దెబ్బతింది. సమాచారం తెలుసుకున్న అగ్నిమాపక సిబ్బంది అక్కడికి చేరుకుని మంటలు అదుపులోకి తీసుకొచ్చారు. ఈ సంఘటనపై పోలీసులు పరిశీలిస్తున్నారు.

స్కూటీ ఢీకొని వ్యక్తికి గాయాలు

మద్దిపాలెం: కంచరపాలెం ఫిఫ్త్ టౌన్ పోలీస్ స్టేషన్ పరిధిలో ఓ వ్యక్తిని వెనుక నుంచి స్కూటీ ఢీకొనడంతో గాయాలయ్యాయి. పోలీసులు తెలిపిన వివరాలిలా.. ఎన్ఏడీ దరి పీఎఫ్ ఆఫీస్ ప్రాంతంలో నివసిస్తున్న కె.కృష్ణ అక్కయ్యపాలెంలోని ఓ హౌసింగ్ కన్‌స్ట్రక్షన్ కంపెనీలో సైట్ ఇంజినీర్‌గా పనిచేస్తున్నాడు. ఆదివారం ఉదయం బైక్‌పై ఎన్ఏడీ నుంచి అక్కయ్యపాలెం వెళ్తున్న క్రమంలో కంచరపాలెం పాలిటెక్నిక్ కాలేజీ సమీపంలోకి వచ్చేసరికి అతడి బైకులోని పేపర్లు కింద పడిపోయాయి. బైకు పక్కకు నిలిపి పేపర్లను తీసుకుని తిరిగి వస్తుండగా.. అటుగా వస్తున్న ఓ మహిళ స్కూటీపై వచ్చి ఢీకొనడంతో సదరు వ్యక్తి కాలికి బలమైన గాయమైంది. క్షతగాత్రుడి ఫిర్యాదు మేరకు సీఐ ఎస్.సాయి నేతృత్వంలో ఏఎస్ఐ రాజారావు కేసు దర్యాప్తు చేస్తున్నారు.

మహోన్నతుడు అబ్దుల్ కలాం



అబ్దుల్ కలాం చిత్రపటం వద్ద నివాళులర్పిస్తున్న వాకర్స్ క్లబ్ ప్రతినిధులు

మురళీనగర్: దేశ సాంకేతిక విజ్ఞాన కీర్తి పతాకాన్ని ప్రపంచ వ్యాప్తంగా ఎగురవేసిన మహనీయుడు ఏపీజే అబ్దుల్ కలాం అని వాకర్స్ క్లబ్ అధ్యక్షుడు పల్లా చంద్రమౌళి అన్నారు. మురళీనగర్ వాకర్స్ పార్కులో క్లబ్ ఆధ్వర్యంలో ఆదివారం మాజీ రాష్ట్రపతి అబ్దుల్ కలాం జయంతి కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రస్తుతం భారత అంతరిక్ష రంగంలో సాధిస్తున్న విజయాలకు అంకురార్పణ చేసి తొలినాళ్లలో దేశీయ సాంకేతికతో ప్రయోగించిన రోహిణి–1, పోలార్ లాంటి ఉపగ్రహ ప్రయోగాలకు నిర్దేశకుడు, మహోన్నత శాస్త్రవేత్త, తత్వవేత్త, మిస్సైల్ మ్యాన్‌గా కలాం ప్రసిద్ధి చెందారన్నారు. భారతరత్నతోపాటు సుమారు 40 ప్రముఖ విశ్వవిద్యాలయాల నుంచి గౌరవ డాక్టరేట్లు పొందిన గొప్ప విద్యావేత్త అని పేర్కొన్నారు. కలాం జన్మదినోత్సవాన్ని ప్రపంచ విద్యార్థుల దినోత్సవంగా పరిగణించారన్నారు. ముందుగా కలాం చిత్రపటానికి చంద్రమౌళితో పాటు పూర్వాధ్యక్షుడు నిమ్మగడ్డ బుచ్చయ్య, వాకర్స్ ఇంటర్నేషనల్ అదనపు కార్యదరిశ రాళ్లపల్లి సత్యనాథం పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. కార్యక్రమంలో ఎ.కృష్ణారావు, సత్తి సునీల్ రెడ్డి, ఉపాధ్యక్షులు ఆదిభట్ల రామకృష్ణ, ఎ.నూకరాజు, జాలీ వాకర్ ఎన్.ప్రకాశరావు పాల్గొన్నారు.

గైస్‌లో ఇండోర్ గేమ్స్ ప్రారంభం



టేబుల్ టెన్నిస్ గేమ్‌ను ప్రారంభిస్తున్న ప్రిన్సిపాల్ కేవీ రమణ

మురళీనగర్: కంచరపాలెం ప్రభుత్వ కెమికల్ ఇంజనీరింగ్ కాలేజీ(గైస్)లో ఆదివారం ఇండోర్ గేమ్స్ మొదలయ్యాయి. విద్యార్థుల్లో క్రీడలపై ఆసక్తి కల్పించేలా టేబుల్ టెన్నిస్ బోర్డును గైస్ ప్రిన్సిపాల్ డాక్టర్ కేవీ రమణ ప్రారంభించారు. దీనికి రూ.26,000 ఖర్చు చేశారు. ఈ సందర్భంగా అధ్యాపకులు టెన్నిస్ క్రీడలో పాల్గొని విద్యార్థులను ఉత్సాహ పరిచారు. డిపార్ట్‌మెంట్ హెడ్‌లు బీవీ లక్ష్మణరావు, సీహెచ్ జయప్రకాష్‌రెడ్డి, డి.దామోదర్, ఎస్.ప్రశాంతకుమారి, ఇన్‌చార్జి ఫిజికల్ డైరెక్టర్ బి.హెచ్.ప్రదీప్‌కుమార్, స్టూడెంట్ అడ్వైజర్ బి.రామాజంనేయులు పాల్గొన్నారు.

కొండవాలులో కాంపాక్ట్ డస్ట్‌బిన్ల ఏర్పాటు



కాంపాక్ట్ బిన్‌ను ప్రారంభిస్తున్న గంకల అప్పారావు, అప్పలరాజు

కంచరపాలెం: జీవీఎంసీ 48వ వార్డు కంచరపాలెం పరిధి బాపూజీనగర్, శ్రీనివాస్‌నగర్, పోలీస్‌లైన్ ఇందిరానగర్–2, జైభారత్ నగర్ కొండవాలు ప్రాంతాల్లో ఆదివారం 5 కాంపాక్ట్ డస్ట్‌బిన్లను జోన్–5 పబ్లిక్ హెల్త్ ఏఎంహెచ్‌వో డాక్టర్ ఎ.సునీల్‌కుమార్ నేతృత్వంలో ఏర్పాటు చేశారు. ఇటీవల కార్పొరేటర్ గంకల కవిత శానిటరీ సమస్యలపై జీవీఎంసీ కమిషనర్ సాయికాంత్ వర్మకు వినతిపత్రం అందించారు. దీనిపై స్పందించిన కమిషనర్ ఆదేశాల మేరకు వీటిని ఏర్పాటు చేసినట్లు కార్పొరేటర్ తెలిపారు. ఆదివారం వీటిని బీజేపీ పార్లమెంట్ కమిటీ జిల్లా ఉపాధ్యక్షుడు గంకల అప్పారావు, వార్డు శానిటరీ ఇన్‌స్పెక్టర్ డి.అప్పలరాజు ప్రారంభించారు.